www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 7 ఏప్రిల్ 2024



14 వరకూ ఓటు నమోదుకు అవకాశం

ఎన్నికల అధికారి స్వామినాయుడు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈ నెల ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు వయస్సు నిండిన వారు ఆన్‌లైన్‌లో ఓటు నమోదు చేసుకోవచ్చని ఆచంట నియోజకవర్గ ఎన్నికల అధికారి, పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ వి.స్వామినాయుడు తెలిపారు. పెనుమంట్ర మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ వరకు యువ ఓటర్లు ఈ అవకాశం వినియోగించుకోవచ్చన్నారు. ఓటర్ల చిరునామా మార్పు, బదిలీ అయిన వారివి పోలింగ్ రోజున వారు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వారి పేర్లు, వివరాలను అనుబంధ ఓటరు జాబితాలో పొందుపరిచినట్లు స్వామి నాయుడు తెలిపారు.

రాజకీయ 'రంగులు'..!



- అధికారంలో ఉన్నప్పుడు ఒకలా.. ఎన్నికల తరుణంలో మరోలా
- టిడిపి, వైసిపి, బిజెపి నేతల్లో ఇదే ధోరణి
- ప్రజాసమస్యలపై నేతల భిన్న స్వరాలపై జనంలో చర్చ
- 2014 నుంచి 2024 వరకూ అవే సమస్యలపై వాగ్దానాలు
- నరసాపురం, పాలకొల్లు పర్యటనలో చంద్రబాబు ప్రసగంలోనూ అదేతీరు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఊసరవెల్లి రంగులు మార్చిన విధంగా ఎన్నికల తరుణంలో రాజకీయ నాయకుల మాటల్లో రంగులు మారుతున్న తీరు చూసి జిల్లా ప్రజానీకం నోరెళ్లబెడుతున్నారు. ప్రజా సమస్యలపై అధికారంలో ఉన్నప్పుడు ఒకలా.. ఎన్నికల సమయంలో మరోలా మాట్లాడుతూ జనాన్ని ఏమార్చేందుకు టిడిపి, వైసిపి, బిజెపి నేతలు చేస్తున్న విన్యాసాలు అన్నీ ఇన్నీ కావనే చెప్పాలి. శుక్రవారం పాలకొల్లు, నరసాపురంలో జరిగిన చంద్రబాబు పర్యటనలోనూ ఇదే ఒరవడి కనిపించింది. రాష్ట్ర విభజన తర్వాత 2014 ఎన్నికల్లో టిడిపి, వైసిపి నాయకులు ఏ సమస్యలు తీరుస్తామని ప్రజలకు వాగ్దానాలు చేశారో.. 2024 ఎన్నికల్లోనూ అవే సమస్యలపై హామీలు గుప్పిస్తూ ప్రసంగాలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. 2014 ఎన్నికల్లో జిల్లాలో తాగునీరు, కొల్లేరు, పోలవరం నిర్వాసితుల సమస్యలు, డ్రెయినేజీ వ్యవస్థ, వశిష్ట గోదావరిపై వంతెన, ఆర్అండ్‌బి రోడ్లు, సముద్రతీరంలో షిపింగ్ హార్బర్ నిర్మాణం, కాలుష్యాన్ని అరికట్టడం వంటి అనేక హామీలను టిడిపి, వైసిపి అధినేతలు అప్పటి ఎన్నికల్లో గుప్పించారు. 2014 ఎన్నికల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 15 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలు ఉండగా టిడిపి, బిజెపి పొత్తులో భాగంగా అన్ని స్థానాలనూ గెలుచుకున్నాయి. ఐదేళ్లపాటు చంద్రబాబు ముఖ్యమంత్రిగా పాలన సాగించారు. జిల్లా వ్యాప్తంగా ఆక్వా కాలుష్యంతో తాగునీరు దెబ్బతినడంతో జనం దాహం తీర్చే పరిస్థితి లేకుండాపోయింది. తాగునీటి సమస్య పరిష్కరిస్తామని ఎన్నికల్లో చెప్పి అధికారంలోకొచ్చిన టిడిపి ఐదేళ్లలో సమస్యను పరిష్కరించలేకపోయింది. కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తామని మాటిచ్చి నెరవేర్చలేదు. ఫిషింగ్ హార్బర్ నిర్మాణం, కాలుష్యం అరికట్టడం, పోలవరం నిర్వాసితులకు పునరావాసం, చింతలపూడి రైతులకు న్యాయమైన పరిహారం ఏ ఒక్కటీ నేరవేర్చని పరిస్థితి నెలకొంది. 2019 ఎన్నికల్లో జగన్ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం జిల్లా సమస్యలను పరిష్కరించడలో విఫలమైందని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత తాగునీటితో పాటు పోలవరం నిర్వాసితులకు పరిహారం పెంచి ఇస్తామని, రోడ్లు బాగుచేస్తామని, టిడ్కో ఇళ్ల బ్యాంకు రుణాలు రద్దుచేస్తామని, కొల్లేరు ప్రజలకు న్యాయం చేస్తామని, పర్యాటక అభివృద్ధి చేస్తామంటూ, చింతలపూడి రైతులకు న్యాయమైన పరిహారం ఇస్తామంటూ తన పాదయాత్రలోనూ, ఎన్నికల ప్రచారంలో అనేక సమస్యలపై హామీలు గుప్పించారు. వైసిపి ఐదేళ్ల పాలనలో జిల్లాలో ప్రజల సమస్యలు ఏ ఒక్కటీ పరిష్కారం కాలేదు.

మళ్లీ తాగునీరు సమస్యపైనే ప్రసంగాలు

జిల్లా పర్యటనలో టిడిపి అధినేత చంద్రబాబుతోపాటు, నియోజకవర్గాల్లో వైసిపి నేతలు సైతం గతంలో ఇచ్చిన హామీలపైనే మళ్లీ కొత్తగా మాట్లాడుతున్న పరిస్థితి నెలకొంది. నరసాపురం, పాలకొల్లులో చంద్రబాబు తన పర్యటనలో మాట్లాడుతూ తాము అధికారంలోకొచ్చాక పైప్‌లైన్ ద్వారా తాగునీరు అందిస్తామంటూ మళ్లీ మాట్లాడిన పరిస్థితి నెలకొంది. ఫిషింగ్ హార్బర్, వశిష్టగోదావరిపై వంతెన నిర్మాణం వంటి సమస్యలపై 2014లోనూ చంద్రబాబు హామీ ఇచ్చారు. పదేళ్ల తర్వాత జరుగుతున్న ఎన్నికల్లోనూ అదే సమస్యలపై ఆయన మాట్లాడడం జిల్లా ప్రజానీకంలో చర్చనీయాంశంగా మారింది. ఇక వైసిపి నేతలు సైతం అదే విధంగా మాట్లాడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. తాగునీరు, రోడ్లు వంటి అనేక సమస్యలను ఐదేళ్లలో వైసిపి పరిష్కరించలేదు. ఇప్పుడు ప్రజల వద్దకు వెళ్లి తాము అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కరిస్తామంటూ వాటినే ప్రస్తావించడం అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తుతోంది.

పోలవరంకు నిధులు ఇవ్వని బిజెపి.. పోలవరం పూర్తిచేస్తుందట..

రాష్ట్ర విభజన నేపథ్యంలో పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా చట్టంలో పొందుపర్చారు. ప్రాజెక్టు అయ్యే ఖర్చు మొత్తం కేంద్రమే భరిస్తుందని అందులో పేర్కొన్నారు. 2014 నుంచి కేంద్రంలో బిజెపికి చెందిన మోడీ సర్కారే అధికారంలో ఉంది. పోలవరానికి నిధులు ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెడుతోంది. నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలంటే రూ.30 వేల కోట్లు అవుతుందని, కేంద్రం నిధులిస్తే తప్ప తాము ఏమీ చేయలేమని సిఎం జగన్ తన ప్రసంగాల్లో అనేక సార్లు తెలిపిన పరిస్థితి నెలకొంది. ఇప్పుడు టిడిపి, జనసేన, బిజెపి పొత్తుపెట్టుకుని ఎన్నికల బరిలోకి దిగాయి. బిజెపి నాయకులు రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ ఎన్‌డిఎ సర్కార్ వస్తేనే పోలవరం పూర్తవుతుదంటూ మాట్లాడుతున్న పరిస్థితి నెలకొంది. జిల్లాకు వచ్చిన బిజెపి నేతలంతా పోలవరం పూర్తవ్వాలంటే ఎన్‌డిఎ సర్కార్ రావాలంటూ మాట్లాడడం చూసి అంతా విస్తుపోతున్నారు. రాజకీయ నాయకులు మారుస్తున్న రంగులు చూసి జనానికి ఏంచేయాలో అర్థంకాని పరిస్థితి కొనసాగుతోంది.



ఆందోళన చేస్తున్న కార్యకర్తలు, నేతలు

'రామరాజు'ను మార్చడం తగదు

చంద్రబాబు కాన్వాయ్‌ను అడ్డుకున్న టిడిపి ఉండి కార్యకర్తలు

రఘు రామకృష్ణంరాజు టిడిపిలో చేరడంతో హాట్‌టాఫిక్‌గా ఉండి రాజకీయం

ప్రజాశక్తి - పాలకొల్లు

ఉండి నియోజకవర్గ అభ్యర్థి మంతెన రామరాజును మార్చడం తగదంటూ ఆ నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులు చంద్ర బాబు నాయుడు కాన్వాయ్‌ను అడ్డుకునే ప్రయత్నం జరిగింది. పాలకొల్లులో ఎస్ కన్వెన్షన్ హాల్లో శనివారం జరిగిన నరసాపురం పార్లమెంటు నియోజకవర్గంలోని ఏడు నియోజకవర్గాల ముఖ్య నేతలతో చంద్రబాబు సమావేశమయ్యారు. శుక్రవారం పాలకొల్లులో జరిగిన చంద్రబాబు బహిరంగ సభలో కనుమూరి రఘు రామకృష్ణంరాజు టిడిపిలో చేరారు. దీంతో ఆయనకు ఉండి టిక్కెట్ ఇవ్వనున్నట్లు పెద్దఎత్తున ప్రచారం సాగుతోంది. దీంతో ఇప్పటికే ప్రకటించిన టిడిపి ఉండి అభ్యర్థి మంతెన రామరాజు అనుయాయుల అరగం టకు పైగా నినాదాలతో సభా ప్రాంగణం దద్దరిల్లింది. లోపల సమావేశాలు జరుగుతున్నా బయట దాదాపు 200 మందికి పైగా కార్యకర్తలు గట్టిగా నినాదాలు చేశారు. సమావేశం ముగిసి చంద్రబాబు విడిదికి వెళు ్తుండగా ఆయన కాన్వాయ్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో చంద్రబాబు రక్షణ సిబ్బంది కార్యకర్తలను పక్కకు నెట్టి చంద్రబాబును లంచ్ కోసం విడిదికి తీసుకెళ్లారు. హాలు వద్ద కార్యకర్తలు గట్టిగా నినాదాలు చేయడంతో అక్కడికి చేరుకున్న ఎంఎల్ఎ మంతెన. రామరాజు కార్యకర్తలు శాంతంగా ఉండాలని కోరారు. అనంతరం ఎంఎల్ఎ రామరాజు మీడియాతో మాట్లాడుతూ కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తలు తమ కార్యకర్తల మనోభావాలను దెబ్బ తీశాయన్నారు. దీంతో వారంతా ధర్నాకు పూనుకున్నట్లు చెప్పారు. తాను పార్టీ అధినేత చంద్రబాబు మాట శిరసావహిస్తానని అలాగే కార్యకర్తల మాటకు విలువ ఇవ్వాల్సిన అవసరం కూడా ఉందన్నారు. ఆందోళన తీవ్రతరం అవుతుండడంతో హాల్ వద్ద పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు. చంద్రబాబు గుంటూరు జిల్లాకు బయలుదేరే ముందు రామరాజు చంద్రబాబుతో మంతనాలు జరిపారు. అనంతరం తమకు అనుకూల వాతావరణం ఉందని కార్యకర్తలు శాంతంగా ఉన్నారు. ఆఖరి నిమిషంలో ఎంపీ కనుమూరి రఘురాంకృష్ణంరాజు చంద్రబాబు నాయుడును కలవడానికి ప్రయత్నించగా ఆయన్ని కలవకుండానే చంద్రబాబు గుంటూరు జిల్లాకు బయలుదేరారు. హెలీపాడ్ వద్ద మాత్రం షేక్ హ్యాండ్ ఇచ్చి చంద్రబాబు వెళ్లిపోయారు. పాలకొల్లు జనసేన నేతలు ఆఖరి నిమిషంలో సినీ నిర్మాత బన్నీవాసు సారథ్యంలో చంద్రబాబుతో మంతనాలు జరిపి ఫొటోలు తీసుకున్నారు.

ఆకివీడు : చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనలో భాగంగా నరసాపురం ఎంపీ కనుమూరి రఘు రామకృష్ణంరాజు టిడిపిలో చేరారు. అయితే ఆయనకు ఉండి అసెంబ్లీ టిక్కెట్ ఇస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. దీంతో శనివారం పాలకొల్లులో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఎంఎల్ఎ మంతెన రామరాజుకు టిక్కెట్ కొనసాగించాలని కార్యకర్తలు డిమాండ్ చేశారు. రఘు రామకృష్ణంరాజుకు టిక్కెట్ ఇచ్చినట్లు వార్తలు రావడంతో కార్యకర్తల్లో ఆందోళన మరింత పెరిగింది.

అక్రమ మద్యం తరలింపుపై గట్టి నిఘా

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి - భీమవరం

సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేందుకు వీలుగా అక్రమ మద్యం తరలింపు, పంపిణీలపై గట్టి నిఘా ఉంచాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లో శనివారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్‌పి అజిత వేజెండ్లతో కలిసి పోలీస్, సెబ్, ఎక్సైజ్, ఆర్ఒలతో సమావేశమై వివిధ అంశాలపై సమీక్షించారు. డిపోల నుంచి సొమ్ము చెల్లించకుండానే ఎక్కువ మొత్తంలో మద్యం బాటిళ్లు తీసుకెళ్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. మద్యం అమ్మకాలు అనుమానాస్పదంగా పెరిగిన చోట సంబంధిత దుకాణాలపై పూర్తి నిఘా ఉంచాలన్నారు. జిల్లాల్లోని అన్ని ఎక్సైజ్ యూనిట్లు, డిస్టిలరీలు, బాట్లింగ్ యూనిట్లు, మద్యం గోదాములు సంబంధిత అధికారుల నిరంతర నిఘాలో ఉంచి క్షేత్రస్థాయిలో తనిఖీలను ముమ్మరం చేయాలన్నారు. ఎన్నికల సమయంలో ఇతర ప్రాంతాల నుంచి మద్యం రాకుండా సరిహద్దు చెక్‌పోస్టుల్లో తనిఖీలను ముమ్మరం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెసి సివి.ప్రవీణ్‌ఆదిత్య, ఎఎస్‌పి వి.భీమారావు, సెబ్ ఎఎస్‌పి ఎటివి.రవికుమార్, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, ఆర్‌డిఒలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ఇవిఎంల ర్యాండమైజేషన్ కోసం పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఏడు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో ఇవిఎంల రేషన్‌లైజేషన్ ప్రక్రియపై సమీక్షించారు. ఇవిఎం గోడౌన్ల వద్ద పటిష్ట బందోబస్తు నిత్యం కొనసాగాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 12వ తేదీ నుంచి ఇవిఎంల మొదటి ర్యాండమైజేషన్ జరుగుతుందని, అనంతరం వివిధ అసెంబ్లీ నియోజవర్గాలకు ఇవిఎంలు కేటాయించబడతాయన్నారు. ఈ విషయమై రాజకీయ పార్టీల ప్రతినిధులకు ముందుగానే సమాచారాన్ని అందజేసి రాండమైజేషన్ ప్రక్రియకు హాజరయ్యేలా తెలపాలన్నారు.

రూ.41 లక్షలు సీజ్, 22 కేసులు నమోదు

జిల్లా వ్యాప్తంగా చేపట్టిన తనిఖీల్లో రూ.41.63 లక్షలు, 22 కేసులు నమోదు చేసినట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ముందస్తు ఎన్నికల ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అంతర్ జిల్లా చెక్ పోస్టులను 5 ఏర్పాటు చేశామని, జిల్లా వ్యాప్తంగా జరిగిన పోలీసు తనిఖీల్లో 41.63 లక్షల రూపాయలు సీజ్ చేసి, 22 కేసులు నమోదు చేశామని తెలిపారు. 2,322 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. 23 మంది వాలంటీర్లను, ఒప్పంద ప్రతిపదికన ఉద్యోగం చేస్తున్న ఒకరిని, విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. ఇద్దరు వాలంటీర్లపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, ఇప్పటి వరకు రాజకీయ పార్టీల ప్రతినిధులపై 5 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని, అందులో టిడిపి-2, ఇతరులపై-3, జిల్లాలో ఇప్పటివరకు సివిజిల్ ద్వారా 142 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని పరిష్కరించామని తెలిపారు. వీడియో కన్ఫరెన్స్‌లో జెసి ప్రవీణ్ ఆదిత్య, జిల్లా ఎస్‌పి అజిత వేజెండ్ల పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడే వజ్రాయుధం ఓటు

జిల్లా స్వీప్ నోడల్ అధికారి ప్రభాకర్

ప్రజాశక్తి - భీమవరం

ప్రజాస్వామ్యాన్ని కాపాడే వజ్రాయుధం ఓటు హక్కు అని జిల్లా స్వీప్ నోడల్ అధికారి జిసిహెచ్ ప్రభాకర్ అన్నారు. శనివారం పట్టణంలోని జిల్లా పౌర సరఫరాల శాఖ, భీమవరం బార్ సోషల్, ఆదిత్య డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఓటర్లకు అవగాహన కార్యక్రమం స్థానిక బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా స్వీప్ నోడల్ అధికారి జిహెచ్.ప్రభాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ నిబద్ధతతో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎలాంటి ప్రలోభాలకు లోను కావొద్దన్నారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ టి.శివరామ ప్రసాద్, డిఎస్ఒ ఎన్.సరోజ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రమణారావు, జిల్లా ఎంపిడిఒ వెంకట రామన్, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి పాల్గొన్నారు.

ఉపాధి కూలీల పరిస్థితి అగమ్యగోచారం

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సత్యనారాయణ

ప్రజాశక్తి - భీమవరం

గణపవరం మండలంలో ఉపాధి హామీ కూలీల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా విభజనలో భాగంగా గణపవరం మండలాన్ని పశ్చిమగోదావరి జిల్లాలో విలీనం చేసినప్పటికీ అధికార లావాదేవీలన్నీ ఏలూరు జిల్లాగానే ఉండటం వల్ల ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. గణపవరం మండలంలో కూలీలకు గుర్తించిన పనులు ఆమోదం పొందకపోవడంతో పనుల్లేకుండా ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉందన్నారు. దీనిపై జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లగా టెక్నికల్‌గా కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో మార్పులు జరిగిన ఫలితంగా ఆలస్యమైందని చెప్పారన్నారు. ఇప్పటికే కొంత భాగం టెక్నికల్ ఇబ్బందులను పూర్తి చేశామని, మరొక రెండు రోజుల్లో పూర్తిగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా కూలీలకు పనులు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు. ప్రస్తుతం పనులు లేని రోజుల్లో పనులు కావాలని కూలీలు ఎదురుచూస్తుంటే టెక్నికల్ ఇబ్బందుల పేరుతో పనులు చూపించకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే పనులు చూపించాలని సత్యనారాయణ డిమాండ్ చేశారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే క్రిమినల్ కేసులు

జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య

ప్రజాశక్తి - భీమవరం

లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా, ప్రోత్సహించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్‌ఆదిత్య అన్నారు. సాధారణ ప్రసవాలు నూటికి నూరు శాతం జరిగేలా చూడాలని, అన్ని డెలివరీలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే జరిగేలా చూడాలని ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో పిసి పిఎన్‌టి డిటి యాక్టు 1994పై సంబంధిత అధికారులతో ఆయన శనివారం సమావేశం నిర్వహించారు. జిల్లాలో కొత్తగా స్కానింగ్ సెంటర్లు ఏర్పాటు, తొమ్మిది సెంటర్లు రెన్యువల్స్, ఎనిమిది సెంటర్లు ఆధునీకరణకు మంజూరుపై సంతానోత్పత్తి కేంద్రాలు, అల్ట్రా సౌండు కేంద్రాలపై సమీక్షించారు. గర్భిణులకు కేవలం శిశువు ఆరోగ్య విషయాలు తెలుసుకునేందుకు స్కానింగులు నిర్వహించాలని, లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. సాధారణ ప్రసవాలు ఎక్కువగా జరిగేలా చూడాలన్నారు. తప్పని పరిస్థితుల్లో మాత్రమే తల్లి బిడ్డ క్షేమం కోసం ఆపరేషన్ చేసేందుకు మొగ్గు చూపాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తల్లి గర్భంలో పిండస్త శిశు పరీక్షలు జరగకుండా నిరోధించాలన్నారు. జిల్లాలోని స్కానింగ్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేయాలని, లింగ నిర్ధారణ పరీక్షలు చేసే సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు, అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.భానూనాయక్, డిసిహెచ్ఎస్ డాక్టర్ పి.సూర్యనారాయణ, డిప్యూటీ డిఎంహెచ్ఒ వాకపల్లి ప్రసాద్, జిల్లా రెడ్ క్రాస్ సంస్థ ఛైర్మన్ డాక్టర్ రామభద్రిరాజు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ డాక్టర్లు, ప్రయివేట్ డాక్టర్లు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ప్రవీణ్‌ఆదిత్య

ధైర్యంగా ఓటు వేయండి

పలు గ్రామాల్లో పోలీసుల కవాతు

ప్రజాశక్తి - ఉండి

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఓటర్లలో భయాందోళనలను రూపుమాపేందుకు మండలంలోని వెలివర్రు, చిలుకూరు, మహదేవపట్నం పలు గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసుల కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ లక్ష్మణ్ మాట్లాడుతూ ఓటర్లందరూ నిర్భయంగా ఓటు వేయాలని చెప్పారు. గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రక్షణ కల్పించే బాధ్యత తమదన్నారు.



కవాతు చేస్తున్న పోలీసులు

నిరంతర కృషితోనే లక్ష్యాల సాధన

నిట్ డీన్ అకడమిక్ డాక్టర్ టి.కురుమయ్య



నిట్ యాజమాన్యం, వక్తలు, విద్యార్థులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఆటలైనా, పాటలైనా, కళలైనా మనస్సు పెట్టి సాధన చేస్తే లక్ష్యాలను సులభంగా ఛేదించవచ్చని ఎపి నిట్ డీన్ అకాడమిక్ డాక్టర్ టి.కురుమయ్య విద్యార్థులకు సూచించారు. నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ బిఎస్.మూర్తి ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి పర్యవేక్షణలో నిట్ వార్షిక క్రీడా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి కురుమయ్య మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను రాణించాలన్నారు. ఆరోగ్యంతోపాటు మేధోశక్తిని పెంపొందించడానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. నూతన విద్యా విధానంలో పరిశోధనలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చారని, వైవిధ్యభరితమైన ఆలోచనలతో ముందుకొచ్చే విద్యార్థులను సంస్థ ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని వివరించారు. డీన్‌లు డాక్టర్ జిబి.వీరేష్ కుమార్, డాక్టర్ కార్తీక్ శేషాద్రి మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం ద్వారా ఖ్యాతి గడించడమే కాకుండా జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చున్నారు. క్రీడలు శారీరక, మానసిక దారుఢ్యాన్ని మెరుగుపరుస్తాయన్నారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యం కోసం నడక, యోగా, ధ్యానం వంటి వాటికి కొంత సమయాన్ని కేటాయించాలని వివరించారు. ఈ కార్యక్రమానికి స్టూడెంట్ వెల్ఫేర్ అసోసియేట్ డీన్ డాక్టర్ కిరణ్ తీపర్తి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు పతకాలు, ధ్రువపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ నరసింహ, డాక్టర్ వి.సందీప్, డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ పి.కిషోర్, డాక్టర్ తలారి రేష్మా, సాస్ అసిస్టెంట్స్ డాక్టర్ వి.శ్రీనివాస్, సాయిరామ్, సంధ్యారాణి పాల్గొన్నారు.

డిపార్ట్‌మెంటేతర అధికారులతో విచారణ జరపాలి

డ్వాక్రా గ్రూపుల్లో జరిగిన అవినీతిపై సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - తణుకు రూరల్

మండలంలోని దువ్వ గ్రామంలో డ్వాక్రా గ్రూపుల్లో జరిగిన భారీ అవినీతిపై డిపార్ట్‌మెంటేతర అధికారులతో విచారణ జరిపించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.ఆదినారాయణబాబు, గుబ్బల గోపీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డ్వాక్రా గ్రూపుల్లో మహిళలు తమ ఆర్థిక అవసరాల కోసం తిని, తినక రూపాయి రూపాయి పొదుపు చేసుకుంటున్నారన్నారు. 45 డ్వాక్రా గ్రూపుల నుంచి కేవలం ఒక్క సిఎ రూ.లక్షలు మాయం చేయడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. జరిగిన ఈ భారీ కుంభకోణంలో కింది స్థాయి నుంచి పైవరకు పాత్ర ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. సిఎ ఫోన్ ద్వారా ఎవరెవరికి ఎంత మొత్తం వెళ్లాయో పరిశీలన చేయాలన్నారు. ఇటువంటి కుంభకోణాల వల్ల డ్వాక్రా సంఘాల్లో పొదుపు చేస్తున్న మహిళల్లో ఆత్మస్థైర్యం దెబ్బ తింటుందన్నారు. వెంటనే ఈ వ్యవహారంపై కలెక్టర్ జోక్యం చేసుకుని డిపార్ట్‌మెంట్‌లో అధికారులతో కాకుండా ఇతర ఉన్నతాధికారులతో సమగ్ర విచారణ చేసి తెర ముందు తెర వెనుక ఉన్న నిందితులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ప్రతి పైసా తిరిగి జమ చేయాలన్నారు. త్వరలో కలెక్టర్‌ని స్వయంగా కలిసి రాత పూర్వకంగా వినతిపత్రాన్ని అందిస్తామని తెలిపారు.



నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

పెరిగిన ఉష్ణోగ్రతలు.. నిర్మానుష్యంగా రోడ్లు

ప్రజాశక్తి - ఆకివీడు

ఎండలు పెరిగిపోవడంతో ప్రజలు రోడ్డు మీదకు రావడానికి భయపడుతున్నారు. ఉదయం 11 అవ్వకుండానే ఎండ వేడి 39 డిగ్రీలు దాటిపోవడంతో రోడ్లు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో ప్రయాణికుల రద్దీ తక్కువగా ఉంటుంది. సాయంత్రం ఐదు గంటల లోపు రోడ్డు మీదకు రావడానికి ప్రజలు భయపడే పరిస్థితి ఉంది.

ముస్లిములకు మంత్రి కొట్టు ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

భక్తిశ్రద్ధలకు ప్రతీక పవిత్ర రంజాన్ మాసమని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక మహమ్మదీయ ఖురేషి చిన్న మసీదులో శనివారం సాయంత్రం ఆయన ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి పంక్తిలో కూర్చుని ఇఫ్తార్ విందును స్వీకరించారు. అనంతరం నమాజ్ ప్రార్థనలో సాంప్రదాయ బద్ధంగా అత్యంత భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు ఎంతో నిష్టతో భక్తిశ్రద్ధలతో ఉపవాసం పాటిస్తారన్నారు. ముస్లిం కుటుంబాలన్నీ సుఖ సంతోషాలతో ఉండాలని, ఆర్థికంగా బలపడాలని, అందరికీ మేలు జరగాలని ఆయన ఆకాంక్షించారు. అందరం సోదర భావంతో కలిసి మెలిసి ముందుకు సాగాలన్నారు. ప్రశాంతమైన జీవనం గడిపేందుకు శాంతియుత సమాజం కోసం అందరం కలిసి పాటుపడాలని మంత్రి కొట్టు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ ప్రెసిడెంట్ షఫీ ఉర్ రహమాన్, సెక్రటరీ జహీర్ రెహమాన్, వైస్ ప్రెసిడెంట్ ఖలీల్ రెహమాన్, తాజుద్దీన్ బాబా, షేక్ అహ్మద్, ముస్లిం పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రత్యేక హోదా

పార్టీ ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి వెంకట గోపాలకృష్ణంరాజు

ప్రజాశక్తి - కాళ్ల



ప్రచారంలో గోపాలకృష్ణంరాజు

రాష్ట్రానికి ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు అన్నారు. మండలంలోని కాళ్లకూరు, దొడ్డనపూడి, కాళ్ల, కోమటిగుంట, సీసలి, జక్కరం, పెదఅమిరం, వేంపాడు, కోపల్లె గ్రామాల్లో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా అధికారంలో ఉన్న బిజెపి ప్రత్యేక హోదా, విభజన హామీలు, పోలవరం వంటి జాతీయ ప్రాజెక్టులు, యూనివర్సిటీలు, విద్యాసంస్థలు, ఆరోగ్య సంస్థలు వంటి హామీలనూ నెరవేర్చలేదన్నారు. రాష్ట్రంలో రెండు ప్రధాన పార్టీలు వైసిపి, టిడిపి కేంద్రం నుంచి ఏమీ సాధించలేకపోయారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొస్తే తొమ్మిది గ్యారెంటీలను ఇచ్చిందని, వాటిలో ప్రధానమైనది ప్రత్యేక హోదా అన్నారు. ఈ ప్రచారంలో పిసిసి కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సోడదాసి గంగయ్య, కాంగ్రెస్ పార్టీ ఆకివీడు మండలాధ్యక్షులు చింతా ఆదిశేషు, కాళ్ల మండలాధ్యక్షులు కొల్లి సత్య శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సుకు కృషి

చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం

ఒక్క రూపాయి అవినీతి లేకుండా నేరుగా 1602 రైతులకు 1754 ఎకరాల దర్భరేవు కంపెనీ భూములు పట్టాలు అందిచామని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని దర్భరేవులో 19వ రోజు ప్రజ ఆశీర్వాద ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ప్రసాదరాజు ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని కుయుక్తులు పన్నినా, ఎన్ని ప్రలోభాలు పెట్టినా ప్రజలందరికి మంచి చేశామన్నారు. ప్రజా శ్రేయస్సు కోసమే పనిచేశామన్నారు.

'అభివృద్ధి, సంక్షేమం టిడిపి కూటమితోనే సాధ్యం'

ప్రజాశక్తి - భీమవరం రూరల్

అభివృద్ధి సంక్షేమమే టిడిపి కూటమి లక్ష్యమని, ఆటో కార్మికులకు డ్రైవర్లకు అండగా ఉంటామని ఆ పార్టీ భీమవరం ఎంఎల్ఎ అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. మిందకుదురు రవి, ములుగుర్తి కృష్ణ ఆధ్వర్యంలో 48 మంది ఆటో యూనియన్ నాయకులు జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు, మాజీ ఎంఎల్ఎ అంజిబాబు సమక్షంలో పార్టీలోకి చేరారు. వారికి పార్టీ కండువాను కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో భీమవరం పట్టణ అధ్యక్షులు చెనమల్ల చంద్రశేఖర్, రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి వబిలిశెట్టి రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి బండి రమేష్‌కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి సుంకర రవీంద్రనాథ్‌ఠాగూర్, మాజీ కౌన్సిలర్లు వానపల్లి సూరిబాబు, మాగాపు ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

'ఎంపీ, ఎంఎల్ఎ సీట్లు కాపులకే కేటాయించాలి'

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పార్లమెంట్, అసెంబ్లీ సీట్లను కాపులకే కేటాయించాలని, ఏ పార్టీ అయితే ప్రాధాన్యత కల్పిస్తుందో వారికే తమ మద్దతు ఉంటుందని సీనియర్ రాజకీయ నాయకులు, మాజీ సర్పంచి రంగారావు తెలిపారు. మండలంలోని వైఎస్.పాలెం, మాజీ సర్పంచి, కాపు సంఘం మండల మాజీ అధ్యక్షుడు కూనపరెడ్డి రంగారావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నరసాపురం నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న కాపు సామాజిక తరగతులు వారే రాజకీయంగా ఉన్నత పదవులు అలంకరించారని తెలిపారు. గ్రంధి వెంకటరెడ్డి నాయుడు హయాం నుంచి నేటి వరకు చేగొండి హరిరామజోగయ్య, కొత్తపల్లి సుబ్బారాయుడు, కొత్తపల్లి జానకిరామ్, బండారు మాధవనాయుడు అసెంబ్లీ అభ్యర్థులుగా గెలుపొంది సారధ్యం వహించారని తెలిపారు. చేగొండి హరిరామ జోగయ్య, కొత్తపల్లి సుబ్బారాయుడు, నరసాపురం పార్లమెంట్ సభ్యులుగా కొనసాగి నరసాపురం కీర్తి ప్రతిష్టలతో పాటు దేశ రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. ఏ రాజకీయ పార్టీ అయితే అధిక శాతం కలిగి ఉన్న కాపు సామాజిక తరగతికి నరసాపురం అసెంబ్లీ, పార్లమెంటు సీట్లు కేటాయిస్తాయో వారికే తమ మద్దతు ఉంటుందన్నారు.

నేరాలు - ఘోరాలు

కోడిపందేల స్థావరంపై దాడి

11 మందిపై కేసు

ప్రజాశక్తి - పాలకోడేరు

కోడిపందేల స్థావరంపై దాడి చేసిన పోలీసులు 11 మందికి అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి కోడిపుంజులు, మోటార్‌సైకిళ్లు, నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పెన్నాడ శివారులో కోడిపందేలు ఆడుతున్నారన్న సమచారం మేరకు పాలకోడేరు ఎస్ఐ నాలం శ్రీనివాసరావు తన సిబ్బందితో శనివారం దాడి చేశారు. ఈ దాడిలో 11 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి తొమ్మిది కోడిపుంజులు, ఏడు మోటార్ సైకిళు,, రూ.5100 నగదు స్వాధీనం చేసుకున్నారు. 11 మంది పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చంద్రబాబును కలిసిన మాధవనాయుడు

ప్రజాశక్తి - నరసాపురం

పాలకొల్లులో ఎస్.కన్వెన్షన్‌లో టిడిపి నరసాపురం పార్లమెంట్ నాయకులతో టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బండారు మాధవనాయుడు ఆయనను కలిశారు. నియోజకవర్గ రాజకీయ పరిస్థితుల గురించి చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం ప్రజాగళం సభకు విచ్చేసిన చంద్రబాబుకు హెలిప్యాడ్ వద్ద మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ప్రజాగళం సభకు మాధవ నాయుడు దూరంగా ఉన్నారు. ఇటీవల ఆయన టిడిపి లేదా రెబల్ లేదా ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తారని ఊహాగానాలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. చంద్రబాబు వచ్చిన సభకు మాధవ నాయుడు దూరంగా ఉండటంతో చంద్రబాబుకు సమాచారం రావడంతో ఆయన పాలకొల్లు సమావేశానికి రప్పించి మాట్లాడారు. జనసేన విజయం కోసం పనిచేయాలని, భవిష్యత్తులో మంచి భవిష్యత్తు ఉంటుందని హామీ ఇచ్చారని సమాచారం. ఆయన జనసేన అభ్యర్థి నాయకర్‌కు మద్దతు ఇస్తారా? పోటీలో ఉంటారా అని వేచి చూడాల్సి ఉంది. దీనిపై నియోజకవర్గ పరిధిలోని ప్రజల్లో చర్చ జరుగుతోంది.

సుబ్బన్నరెడ్డి క్రీడానైపుణ్యం యువతకు ఆదర్శం

ప్రజాశక్తి - పెనుమంట్ర

బాస్కెట్ బాల్ క్రీడాకారునిగా మార్టేరు గ్రామానికి అంతర్జాతీయ స్థాయిలో కీర్తి తెచ్చిన సుబ్బన్నరెడ్డి నైపుణ్యం యువతకు ఆదర్శమని మానవత జిల్లా అధ్యక్షులు కొత్త సత్యనారాయణ మూర్తి అన్నారు. మార్టేరు ఎస్‌విజి ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో ఖండవల్లి కిషోర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన క్రీడాసామగ్రి కిట్స్‌ను నరసాపురం ఆర్‌టిసి డిపో మేనేజర్, అంతర్జాతీయ బాస్కెట్ బాల్ క్రీడాకారుడు సత్తి సుబ్బన్నరెడ్డి యువ క్రీడాకారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు కర్రి వేణుబాబు, వెలగలేరు సొసైటీ అధ్యక్షులు అల్లం భాస్కర రెడ్డి, జి.లక్ష్మణ రెడ్డి, ఎన్.వివేకానందరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, పలువురు క్రీడాకారులు, సుబ్బన్న రెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

ఆచంట వేమవరంలో శ్రీరంగనాధరాజు ప్రచారం

ప్రజాశక్తి - ఆచంట

ప్రజలకు మంచి పాలన, సంక్షేమ పథకాలు అందించడంలో సిఎం జగన్ ముందంజలో ఉన్నారని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆచంట వేమవరంలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతి, రాష్ట్ర భవిష్యత్ జగన్‌తోనే సాధ్యమన్నారు. గతంలో సంక్షేమ లబ్ధి పేదలకు చేరడానికి జన్మభూమి కమిటీలు అడ్డంకిగా ఉండేవన్నారు. వాటి అరాచకాలను ఆపడానికి జగన్ వాలంటరీ వ్యవస్థను చేపట్టి ప్రజలకు అండగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి జక్కంశెట్టి చంటి, సుంకర సీతారామ్, కొండేటి సురేష్ బాబు, అందే నాగ బసవన్న, మంగారావు, లీలా సుబ్బారావు, వీర వీరభద్రం, పెద్దిరాజు, ప్రేమ్‌కుమార్, సత్యనారాయణ, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, రాజు పాల్గొన్నారు.

మొగల్తూరులో వేలంపాట

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు పంచాయతీకి కూరగాయలు, చేపల మార్కెట్, వాహనాల పన్ను ఏడాది కాలం వసూలుకు శనివారం పంచాయతీ కార్యాలయంలో వేలంపాట నిర్వహించారు. గ్రామానికి చెందిన వెంకట నాగేశ్వరరావు రూ.3.65 లక్షలకు హెచ్చు పాట పాడారని ఇఒపిఆర్‌డి నవీన్ కిరణ్, పంచాయతీ కార్యదర్శి జి.గంగన్న తెలిపారు.

పార్టీ, ప్రజల గురించే ఆలోచించా

ఉండి స్వతంత్ర్య అభ్యర్థి శివరామరాజు

ప్రజాశక్తి - ఆకివీడు

తాను ఎప్పుడూ పార్టీ, నియోజకవర్గ ప్రజల గురించి ఆలోచించానని, అందుకోసమే తన సమయం పూర్తిగా కేటాయించానని ఉండి స్వతంత్ర అభ్యర్థి వేటుకూరు శివరామరాజు అన్నారు. మండలంలోని కొల్లేటి గ్రామాలు సిద్ధాపురం, చిన్నమిల్లిపాడు, కాలింగిగూడెం, రాజులపేట, కోళ్లపర్రు గ్రామాల్లో ఆయన శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం, ప్రజల కోసం పూర్తిస్థాయిలో పని చేసిన తనను పార్టీ పక్కన పెట్టడం బాధగా ఉందన్నారు. తాను పోటీ నుంచి తప్పుకునే ప్రసక్తే లేదన్నారు.

పేదరిక నిర్మూలనే వైసిపి లక్ష్యం

విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రాష్ట్రంలో పేదరికం నిర్మూలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పనిచేశారని విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని యనమదుర్రు గ్రామంలో శనివారం రాత్రి నిర్వహించిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి సంక్షేమ పథకాలను సిఎం జగన్ అమలు చేశారన్నారు. భీమవరం నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్న తనను ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించే విధంగా పార్టీ శ్రేణులు పనిచేయాలన్నారు. అనంతరం పలువురు పార్టీలో చేరారు.

రఘురామకృష్ణంరాజును కలిసిన టిడిపి నేతలు

ప్రజాశక్తి - కాళ్ల

ఉండి నియోజకవర్గ అభ్యర్థిగా కనుమూరి రఘురామకృష్ణంరాజు పేరు పరిశీలిన జరుగుతుందని ప్రచారం కావడంతో ఉండి నియోజకవర్గ నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు శనివారం సాయంత్రం రఘురామకృష్ణంరాజును అభినందించారు. పెదఅమిరం గ్రామంలో రఘురామకృష్ణంరాజు నివాసంలో అయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. వేగేశ్న కాశీ రాజు, వేగేశ్నసూర్యనారాయణరాజు, పొత్తూరి వెంకటేశ్వరరాజు, ఉండి, కాళ్ల, ఆకివీడు, పాలకోడేరు మండలాల నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆయనను కలిశారు.

'ముదునూరిని గెలిపించాలి'

మొగల్తూరు : రానున్న ఎన్నికల్లో వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజును ఆదరించాలని ఆయన తనయుడు శ్రీకృష్ణంరాజు ప్రజలను అభ్యర్థించారు. రామన్నపాలెం పంచాయతీ పరిధి పిట్టావారిపేట, లక్కువారితోట, కొత్త హరిజనపేటలో శనివారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద కార్యక్రమంలో భాగంగా ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణంరాజు మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే వైసిపి మళ్లీ అధికారంలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు అనంత సుబ్రహ్మణ్యం, ఎంపిటిసి సభ్యులు అయితం ధనలక్ష్మి, ఆకన దుర్గా దొరబాబు, కొల్లాబత్తుల సత్యానందం, అయితం బాబులు, బుజ్జి, మెట్టి సువర్ణరాజు, అడ్డాల సాంబమూర్తి పాల్గొన్నారు.

ఆ మలుపు.. ప్రమాదాలకు పిలుపు..!

ప్రజాశక్తి - పెనుమంట్ర



ప్రమాదకరంగా ఉన్న మలుపు

తాడేపల్లిగూడెం-కోడేరు రహదారి మార్గంలో పెనుమంట్ర మండలంలోని మార్టేరు శివారు వెలగలేరు వద్ద మలుపు ప్రమాదభరితంగా ఉంది. దీంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. నిత్యం ఈ మార్గంలో అటు తాడేపల్లిగూడెం నుంచి, ఈ వైపు ఆచంట, కోడేరు, పెనుగొండల నుంచే కాకుండా భీమవరం వైపు నుంచి వేలాదిగా చిన్నా, పెద్దా వాహనాలు తిరుగుతూ ఉంటాయి. అతివేగంగా వచ్చే వాహనాలు ఈ మలుపు వద్ద నియంత్రణ కోల్పోయి ప్రమాదాల బారిన పడుతున్నాయి. ఈ మలుపు ప్రమాదాలు చోటు చేసుకుని అనేకమంది తీవ్ర గాయాలపాలైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. ప్రమాదాల నివారణకు రహదారుల శాఖ వారు వెంటనే మలుపు వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు, రోడ్డుపై జీబ్రా గీతల పెయింటు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎస్ఆర్‌కెఆర్‌లో అపూర్వ 24 వర్క్‌షాపు ప్రారంభం



మాట్లాడుతున్న విజయరామరాజు

ప్రజాశక్తి - భీమవరంరూరల్

భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులతో రెండు రోజులపాటు నిర్వహించే అపూర్వ 24 వర్క్‌షాపు శనివారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ట్రిబుల్‌ఇ విభాగం హెడ్ డాక్టర్ బిఆర్‌కె.వర్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాదులోని గోకరాజు రంగరాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్, టెక్నాలజీ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగం హెడ్‌డాక్టర్ వి.విజయరామరాజు మాట్లాడారు. ప్రధానంగా సాంకేతిక విద్యలో విద్యార్థికి మెలకువలు నేర్పేందుకు, సంబంధిత సబ్జెక్టులో విద్యార్థి ఆలోచనలకు మరింత నైపుణ్యం అందించేందుకు గురువు ప్రాధాన్యత ఎంతో ఉందన్నారు. ప్రధానంగా సాంకేతిక విద్యారంగంలో ప్రాజెక్టులు చేపట్టినప్పుడు వాటిపై విద్యార్థి అనుమానాలు గురువు మాత్రమే నివృత్తి చేయగలరన్నారు. సాంకేతికత పెరిగినందున గురువు అవసరం లేదనే భావన ప్రతిఒక్కరూ విరమించుకోవాలన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ సాంకేతిక రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్న దాన్ని సామాన్యుడికి చేరవేసే బాధ్యత కోర్ గ్రూప్ ఇంజినీర్లదేనన్నారు. ఈ రంగాల్లో విద్యార్థులు మరింత నైపుణ్యం సంపాదించుకుని పరిశోధనల వైపు దృష్టి కేంద్రీకరించాలని కోరారు. కళాశాల ఉపాధ్యక్షులు ఎస్‌వి.రంగరాజు, ట్రిబుల్ ఇఇ విభాగం హెడ్ డాక్టర్ బిఆర్‌కె.వర్మ, సీనియర్ ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాస్ మాట్లాడుతూ పరిశ్రమ, విద్యాసంస్థల మధ్య మరింత అనుబంధం పెంచేందుకు దేశ విదేశాల్లో ఉన్నత స్థానంలో ఉన్న తమ పూర్వ విద్యార్థుల అనుభవాలను ప్రస్తుత విద్యార్థులకు అందించేందుకు అపూర్వ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ట్రిబుల్‌ఇ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో రూపొందించిన ట్రిబుల్ ఇఇఇ క్రానికల్‌ను ముఖ్యఅతిథి విజయరామరాజు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అలుమిని కోఆర్డినేటర్ ఎం.అనిల్, ఇఇఇ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.హరీష్‌కుమార్‌వర్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రాథమిక చికిత్సపై అవగాహన

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం డిగ్రీ కాలేజీ విద్యార్థులకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ పి.సంతోష్‌నాయుడు ప్రాథమిక చికిత్సలపై శనివారం అవగాహన కల్పించారు. మహిళా సాధికారత సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో సంతోష్ నాయుడు పాల్గొని మాట్లాడారు. ఈ సదస్సులో సంతోష్‌నాయుడు విద్యార్థులకు సిపిఆర్‌పై అవగాహన కల్పించారు. కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి మాట్లాడుతూ డాక్టర్ సంతోష్‌నాయుడు ప్రాక్టికల్‌గా చూపించిన చికిత్సలపై అవగాహన కల్పించుకుని అత్యవసర పరిస్థితుల్లో భయానికి గురి కాకుండా సహకారం చేసే విధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజీ లెక్చరర్లు సిహెచ్.చైతన్య, కె.స్వరూపరాణి, జి.వెంకట్రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి.వెంకటరమణ, టి.అక్కిరాజు, ఎన్‌విఎన్‌బి శ్రీనివాసరావు, సిహెచ్‌ఒ జాలాది విల్సన్‌బాబు పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధి వైసిపితోనే సాధ్యం

ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి పివిఎల్.నరసింహరాజు

ప్రజాశక్తి - ఉండి



ప్రచారంలో పివిఎల్.నరసింహరాజు

గ్రామాలాభివృద్ధి వైసిపితోనే సాధ్యపడుతుందని వైసిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి పివిఎల్.నరసింహరాజు అన్నారు. మండలంలోని పెదపుల్లేరులో పార్టీ గ్రామ అధ్యక్షులు యడ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో గడపగడపకూ వెళ్లి వైసిపికి ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం పివిఎల్.నరసింహరాజు మాట్లా డుతూ పెద్దపుల్లేరు గ్రామంలో ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన పారిశుధ్య, తాగునీరు, అంతర్గత రహదారులు వంటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. పార్టీలకు అతీతంగా గ్రామంలోని అర్హులందరికీ ఇంటి స్థలాలను కేటాయించడమే కాకుండా కరోనా సంక్షోభంలో కూడా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. లబ్ధి పొందిన ప్రతిఒక్కరూ సిఎం జగన్ రుణం తీర్చుకునేందుకు వచ్చే ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి అయిన తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ బొక్కా వెంకటేశ్వర్లు, ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, పార్టీ మండలాధ్యక్షులు ఆంజనేయరాజు, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడిద వెంకటేశ్వరరావు, రూరల్ బ్యాంక్ త్రిసభ్య కమిటీ ఛైర్మన్ గుల్ల అప్పన్న, డైరెక్టర్ కలిదిండి సీతారామరాజు, ఎంపిటిసి సభ్యులు రాయి రాములమ్మ, నాయకులు కమ్మిలి గణేష్ వర్మ, రణస్థుల మహంకాళి, రాయి సతీష్, శేషాద్రి శ్రీనివాస్, కరణం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

శాసనమండలి ఛైర్మన్ కుమార్తె ఇందిరా



క్యాంపును ప్రారంభిస్తున్న ఇందిరా

ప్రజాశక్తి -భీమవరం

సమ్మర్ క్యాంపులను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ ఇందిరా అన్నారు. పట్నంలో ఏర్పాటుచేసిన సమ్మర్ డ్రాయింగ్ క్లాసులను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమ్మర్ క్లాసుల్లో భాగంగా ఆర్ట్, క్రాఫ్ట్, టైలరింగ్, ఎంబ్రాయిడింగ్ వంటి వాటిపై శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. వీటిని ప్రతిఒక్కరూ నేర్చుకుంటే వ్యక్తిగత ఉపాధికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇటువంటి సమ్మర్ ఏర్పాటు చేయడం యాజమాన్యం గొప్పతనమన్నారు. ఈ కార్యక్రమంలో దావీదు ఆర్ట్స్‌కు చెందిన గోడి దావీదు, కుమారి, రమేష్ పాల్గొన్నారు.

ఆర్‌టిసి ప్రయాణికులకు బహుమతులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఆర్‌టిసి బస్సులో సురక్షితంగా ప్రయాణించడంతో పాటు బహుమతులు పొందొచ్చని తాడేపల్లిగూడెం డిపో మేనేజర్ సూర్యనారాయణమూర్తి అన్నారు. ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణించేవారికి ప్రతి 15 రోజులకు లక్కీ టిప్ ద్వారా బహుమతులను అందిస్తుందని తెలిపారు. జంగారెడ్డిగూడెం, ఆచంట, గణపవరం, భీమవరం రూట్లలో మార్చి 17వ తేదీ నుంచి ఏప్రిల్ రెండో తేదీ వరకు ప్రయాణించిన వారి టికెట్లు శనివారం ఉదయం 11 గంటలకు తాడేపల్లిగూడెం బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల సమక్షంలో లక్కీడీప్ నిర్వహించారు. ఈ లక్కీడీప్ విజేతలకు తాడేపల్లిగూడెం జివి మాల్ షాపు, సెలబ్రేట్ వారి ఆర్థిక సౌజన్యంతో బహుమతులను అందించారు. ఈ నెల 21వ తేదీ సాయంత్రం ఏడు గంటలకు అరుణాచలం యాత్రకు ప్రత్యేక బస్సు బయలుదేరుతుందని డిపో మేనేజర్ మూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ ఎల్.సుధారాణి, యూనియన్ నాయకులు రమణ, సూపర్‌వైజర్ విజయకుమార్, ప్రయాణికులు పాల్గొన్నారు.

పాఠశాలలో గ్రాడ్యుయేషన్ ఉత్సవం

ప్రజాశక్తి - నరసాపురం



గ్రాడ్యుయేషన్ ఉత్సవంలో విద్యార్థులు

కేంబ్రిడ్జ్ మాంటిస్సోరి ప్రీ స్కూల్‌లో కిండర్ గ్రాడ్యుయేషన్ ఉత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు మాదంశెట్టి కోటేశ్వరరావు, గైనకాలజిస్టు పద్మావతి, డైరెక్టర్ రాజ్యలక్ష్మి హాజరయ్యారు. విద్యార్థులు చక్కని వస్త్రాధారణతో అలరించారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా చిన్నారుల నృత్యాలు అందరని ఆకట్టుకున్నాయి. ఉత్తమ డ్యాన్స్‌లకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి వైసిపిని గెలిపించండి'

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సంక్షేమం, అభివృద్ధి, శాంతిభద్రతల కోసం వైసిపిని గెలిపించండని ఆ పార్టీ తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ అభ్యర్థి కొట్టు సత్యనారాయణ కుమార్తె కంచన్, కుమారుడు రాజేష్ కోరారు. స్థానిక రెండో వార్డు గాయత్రి ఆలయం రోడ్డులో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో 1, 2 వార్డుల ఇన్‌ఛార్జులు కొలుకులూరి ధర్మరాజు, పచ్చమట్ల సావిత్రి, వైసిపి జిల్లా కార్యదర్శి దింతకుర్తి లీలావతి, వైసిపి నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

నేడు వారతిప్పలో ప్రజ ఆశీర్వాదం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని వారతిప్పలో ఆదివారం ప్రజ ఆశీర్వాదం కార్యక్రమంలో భాగంగా వైసిపి నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు ఆయన కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఈ ప్రచారంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొవాలని కోరారు.

నరసాపురంలో 'మన కోసం మన నాయకర్'

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలో 14వ వార్డుల్లో మన కోసం మన నాయకర్ కార్యక్రమం నిర్వహించారు. జనసేన నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆ వార్డులో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జక్కం బాబ్జి, కోటిపల్లి వెంకటేశ్వరరావు, వలవల నాని, ఆకన చంద్రశేఖర్, వాతాడి రమేష్, గంటా కృష్ణ, పెమ్మాడి కిరణ్, తోట అరుణ, బొమ్మిడి సూర్యకుమారి, కొప్పాడ కృష్ణవేణి పాల్గొన్నారు.

కాశిపాడులో ధర్మరాజు ప్రచారం

ప్రజాశక్తి - గణపవరం

మండలంలోని కాశీపాడులో జనసేన ఉంగుటూరు ఎంఎల్ఎ అభ్యర్థి పచ్చమట్ల ధర్మరాజు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి వెళ్లి తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. గ్రామంలో ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జై భీమ్ రావ్ నరసాపురం ఎంపీ అభ్యర్థిగా నాగేంద్రకృష్ణ

ప్రజాశక్తి - తణుకు రూరల్

జై భీమ్ రావ్ పార్టీ స్థాపకులు జడ శ్రవణ్‌కుమార్ న్యాయకతంలో నరసాపురం ఎంపీ అభ్యర్థిగా తణుకు పట్టణానికి చెందిన అడ్వకేట్ ఓలేటి నాగేంద్రకృష్ణ పోటీ చేయుచున్నారు. ఈ సందర్భంగా ఏడు నియోజకవర్గాల్లో ఉన్న బార్ అసోసియేషన్ సభ్యులు అనేక మంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.